
పలు గ్రామ పంచాయతీల కనుమరుగు!

- మొత్తం 61 గ్రామాలు
- కనుమరుగు కానున్న 23 గ్రామ పంచాయతీలు
- మిగతా 38 గ్రామాలుంటాయా అనే అనుమానాలు
- నియోజకవర్గంలో కనుమరుగు కానున్న ఘట్‌కేసర్, కీసర మండలాలు
- ఇకపై అర్బన్ జిల్లాగా మేడ్చల్–మల్కాజిగిరి



మేడ్చల్ నియోజకవర్గ చిత్రం

మేడ్చల్: నగర విస్తరణలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయితీలు ఇకపై అదృశ్యం కానున్నాయి. నియోజకవర్గం పరిధిలో మేడ్చల్, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాల్లో కలిపి 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మేడ్చల్ మండలంలో 17, ఘట్‌కేసర్ మండలంలో 11, కీసర మండలంలో 10, శామీర్‌పేట్‌లో 10, మూడు చింతలపల్లి మండలంలో 13, గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం ఐదు మండలాల్లో 61 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 23 గ్రామ పంచాయతీలు సమీప మున్సిపాలిటీల్లో, హైదరాబాద్ నగర పాలక సంస్థలో విలీనం చేసేందుకు ఇటీవలే గ్రామ సభలు నిర్వహించి గ్రామాల ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

- మేడ్చల్ మండలంలో 4 గ్రామాలు, శామీర్‌పేట 3, ఘట్‌కేసర్‌లో 8, కీసరలో 8 గ్రామాలను విలీనం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.
- మేడ్చల్ మండలంలో విలీనం పోను 14 పంచాయతీలు, కీపర మండలంలో రెండు, ఘట్‌కేసర్‌లో 3, కీసరలో 2 గ్రామాలు మాత్రమే గ్రామ పంచాయతీలుగా మిగలనున్నాయి.
- ఘట్‌కేసర్ మండలంలో 11 గ్రామ పంచాయతీలుండగా అందులో 8 విలీనం చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మూడు గ్రామాలైన అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలు మాత్రమే మండల పరిషత్‌లో మిగులుతున్నాయి. కీసర మండలంలో 10 గ్రామ పంచాయతీలకు గాను 8 గ్రామాలు విలీనం చేయనున్నారు.
- భోగారం, అంకిరెడ్డిపల్లి మాత్రమే మండల పరిషత్ కింద మిగులుతున్నాయి. దీంతో మొత్తం 5 గ్రామాలకు మండల పరిషత్ వ్యవస్థ కొనసాగించే అవకాశం ఉన్నందున ఈ రెండు మండలాలు మేడ్చల్ చరిత్ర నుంచి మాయం కావడం కచ్చితంగా కనిపిస్తుంది.
- మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి కీసర, ఘట్‌కేసర్ మండలాలుగా ఉన్నాయి. నగర విస్తరణ కోసం ఏకంగా రెండు మండలాలు చరిత్ర పటంలో లేకుండా పోవడం కలవరపరిచే అంశం.

ఐదు గ్రామాలు ఎటువైపు...

రెండు మండలాల్లో మిగిలిన 5 గ్రామాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలు, కీసర మండలంలో మిగిలిన గ్రామాలు భోగారం, అంకిరెడ్డిపల్లి గ్రామాలు శివారు జిల్లా యాదాద్రి భువనగిరికి దగ్గరగా ఉండటంతో ఆ మూడు గ్రామాలను ఆ జిల్లాలో విలీనం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

- ఘట్‌కేసర్ మండలంలోని గ్రామాలు బీబీనగర్ ఎయిమ్స్ కు దగ్గరగా ఉండటంతో అటు వైపు ఆగ్రామాలను తీసుకెళ్ళే ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు తెలిసింది.

మున్సిపాలిటీలుగా కానున్న గ్రామ పంచాయతీలు..

శామీర్‌పేట్ మండలంలో మిగిలిన 7 గ్రామాలను అలియాబాద్ కేంద్రంగా మార్చి మున్సిపాలిటీ గా, మేడ్చల్ మండలంలో జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న గ్రామాలను డబీల్‌పూర్ కేంద్రంగా ఒక మున్సిపాలిటీ, రావల్‌కోల్ కేంద్రంగా మరో మున్సిపాలిటీ ఏర్పాటు చేయనున్నట్లు అధికార వర్గాల అనధికార సమచారం.

- మేడ్చల్ మండలంలో డబీల్‌పూర్, రావల్‌కోల్, శామీర్‌పేట్ మండలంలో అలియాబాద్, మూడు చింతలపల్లిలో మూడు చింతలపల్లి మున్సిపాలిటీలుగా మారనున్నాయి.
- నూతనంగా నాలుగు మున్సిపాలిటీ ఏర్పాటుతో మేడ్చల్ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల జాడ పూర్తిగా లేకుండా పోతుండటంతో మేడ్చల్ జిల్లా అర్బన్ జిల్లాగా మారనునంది. జిల్లాలో ఉన్న 5 నియోజకవర్గాలైన కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్‌లలో ఇప్పటికే గ్రామాలు లేవు.
- ఆ నాలుగు నియోజకవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నాయి. మేడ్చల్‌లో మాత్రం 61 పంచాయతీలు, 5 మండల పరిషత్‌లు, 5 జెడ్పీటీసీలు ఉండగా తాజా గా రూపోందిస్తున్న ప్రతిపాదనలతో నియోజకవర్గంలో గ్రామాలు లేకుండా పోతుండటంతో కేవలం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల పాలన ఉండనుండటంతో మేడ్చల్ జిల్లా గ్రామాలు లేని జిల్లా గా మారనుంది.
- గతంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్‌లు, మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపీపీలు ఇలా వ్యవస్థలోని అన్ని పాలనలకు నెలవుగా ఉన్న మేడ్చల్ ఇకనై కేవలం కార్పొరేటర్, కౌన్సిలర్ల పాలనకు మారనుంది.

అభివృద్ధి పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మౌలాలి : ప్రగతినగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్, ఏఈ ఉదయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌తో కలిసి పనులు ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు సాయిబాబా, జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగారావు, మౌలాలి జనరల్ సెక్రటరీ శివగౌడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీ నూతన కార్యవర్గం..



వివేకానందనగర్ కాలనీ నూతన సభ్యులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ వివేకానంద కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా కొండే శంకర్, ప్రధాన కార్యదర్శిగా కొలగాని నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్ ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా పంగ లక్ష్మయ్య, అమ్జాద్‌ఖాన్, కోశాధికారిగా తడక శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా వెంపటి వీరయ్యలను ఎన్నుకున్నారు. బుచ్చియాదవ్, మిరపటి జైపాల్‌రెడ్డి, దేవ్‌సింగ్, జయరాం నాయుడు, కృష్ణమూర్తి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సమస్యను పరిష్కరించాలని వినతి



ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నెలకొన్న వక్ఫ్ బోర్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ.. ఆదివారం బీజేపీ నేతలు, రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ పోరాట సమితి సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. క్రయవిక్రయాలు ఆగిపోవడం వల్ల ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించి కేంద్ర ప్రభుత్వం వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి తలారి రవి, నాయకులు ఏనుగుల లక్ష్మయ్య, పోరాట సమితి సభ్యులు మహేష్ దూబె, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ



ఉప్పల్ : ఉప్పల్ చిలుకానగర్ డివిజన్ బాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా రామరాజుయాదవ్ నియమితులయ్యారు. కో– కన్వీనర్లుగా అరగంటి రాజేష్, పెరుమళ్ శివకుమార్, రాచకొండ శివకుమార్,, ముత్యాల కృష్ణారెడ్డి, రేషం మనోజ్‌లను ఎన్నుకున్నారు. చిలుకానగర్ డివిజన్ ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉత్సవ సమితి కేంద్ర కమిటీ సభ్యులు ఇంద్రాల రమేష్, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ రేవల్లి రాజు, అసెంబ్లీ కో– కన్వీనర్ గోనే శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకునేందుకు వీలుగా తమ వంతు కృషి చేస్తామని, మండపాల్లో ఏర్పాట్లు తదితర అంశాలను పరిష్కరిస్తామన్నారు.

జన విజ్ఞాన సేవలు అభినందనీయం

మెడికల్ క్యాంప్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



విద్యార్థినిని సత్కరించిన ఎమ్మెల్యే బండారి

కుషాయిగూడ: సామాజిక బావనతో జనవిజ్ఞాన వేదిక అందిస్తున్న సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చక్రిపురంలోని చక్రి విద్యానికేతన్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక కాప్రా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సేవ కార్యక్రమాలతో పాటుగా ప్రజలను చైతన్యం చేయడం, మూఢ విశ్వాసాలను పారద్రోలడానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యసేవలందించిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, స్థానిక నేతలు శివకుమార్‌గౌడ్, మహేష్‌గౌడ్, నర్సింహ్మా, అనిల్ ముదిరాజ్ వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభినందన..

నీట్‌లో 4924 ర్యాంకు సాధించిన నాగార్జున నగర్ కాలనీ పిట్టల నాగరాజు, శశికళ దంపతుల కూమార్తె సంజనను ఎమ్మెల్యే బండారి అభినందించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి మెడిసిన్ చదువుకు కావాల్సిన ఆర్థికసాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.

శ్రీలక్ష్మినగర్ నూతన కమిటీ

బోడుప్పల్: శ్రీలక్ష్మినగర్ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆసర్ల బీరప్ప, ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, ఉపాధ్యక్షులుగా నర్సింహ్మా, బీరయ్య, కోశాధికారిగా మల్లేష్, సంయుక్త కార్యదర్శులుగా నరేష్, సురేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బీరప్ప మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. నూతన కమిటీని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్ అభినందించారు.

ఘనంగా బోనాల జాతర



హిల్‌టాప్ కాలనీలో బోనం సమర్పిస్తున్న మహిళలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని హిల్‌టాప్ కాలనీలో ఆదివారం అమ్మవారి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించారు.

ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారు : ఈటల



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజిగిరి: రాష్ట్రంలో బీజేపీని ప్రజలు విశ్వసిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ మేడ్చల్, మల్కాజిగిరి అర్బన్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం మల్కాజిగిరిలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈటల మాట్లాడుతూ.. మొదటిసారిగా బీజేపీకి సభ్యత్వ నమోదు చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు సాధించిందని, అత్యధిక ఓటర్లు ఉన్న పార్లమెంట్ స్థానమైన మల్కాజిగిరిలో బీజేపీకి అత్యధిక ఓట్లు వచ్చాయన్నారు. మినీ ఇండియాగా ఉన్న మల్కాజిగిరి పార్లమెంట్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై అభిమానంతో గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, కొల్లి మాధవి, మల్లారెడ్డి, గీతామూర్తి, బేతి సుభాష్‌రెడ్డి, రాణీ రుద్రమదేవి, బాలచందర్‌గౌడ్, మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ డీఎస్. వెంకటేష్, కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణ మహానంది' పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకున్న వెంకటగణేష్‌బాబు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీకి చెందిన వెంకటగణేష్ బాబు జీవన సాఫల్య, స్వర్ణ మహానంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ సంస్కృతి సాహితీసేవ ట్రస్టు, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఆయనకు ఈ జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ఆయన చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలకు గుర్తింపుగా ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. గణేష్‌బాబు మాట్లాడుతూ.. తన తల్లి దండ్రులు నేర్పిన సేవా దృక్పథంతోనే ఈ అవార్డు తనను వరించిందని వారికి రుణపడి ఉంటానన్నారు. ఈ అవార్డు తనలో మరింత ఉత్సాహం నింపిందని, ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతానన్నారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ప్రతిష్ఠాపన పూజల్లో నందికంటి శ్రీధర్, తదితరులు

అల్వాల్: శ్రీసాయినగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పవన్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్, రాజు, గణేష్, సతీష్, రేవంత్‌రెడ్డి, శ్రీనివాసులు, సూర్యప్రకాష్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి నాట్య గురువులు లక్ష్మీశ్రీ నాయుడు శిష్య బృందంచే నిర్వహిరిచిన కూచిపూడి నృత్యం అలరించింది. మహాగణపతిమ్, శ్రీహరి స్తోత్రం, శివ తాండవ స్తోత్రం, జయజయ భారతి, అన్నమాచార్య కీర్తన తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

మెట్రో పెయిడ్ పార్కింగ్‌ను శాశ్వతంగా ఎత్తివేయాలి



నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న పీవైఎల్ సంస్థ ప్రతినిధులు

ఉప్పల్: మెట్రోస్టేషన్లలో పెయిడ్ పార్కింగ్ తాత్కాలిక వాయిదా కాదని, పెయిడ్ పార్కింగ్‌ను పూర్తిగా ఎత్తివేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) డిమాండ్ చేసింది. ఈ మేరకు పెయిడ్ పార్కింగ్ వ్యవస్థను పూర్తి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికులతో కలిసి ధర్నా నిర్వహించారు. మెట్రో యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా కాకుండా సాధారణ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కే.ఎస్. ప్రదీప్ మాట్లాడుతూ.. మెట్రోరైల్ ప్రయాణంపై ఎంతో మంది ఆధారపడి ప్రయాణిస్తున్నారని రైలు ప్రయాణంతో పాటు ఇప్పుడు పార్కింగ్ భారం ప్రయాణికుల మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కింగ్ స్థలంలో కనీస వసతులు కల్పించాలని, షెడ్ నిర్మించి పార్కింగ్‌కు మార్కింగ్ చేయాలని సూచించారు. లేని పక్షంలో సంస్థ మొండి వైఖరి ప్రదర్శిస్తే పెద్దఎత్తున ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ సాయినగర్‌లో సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి కాలనీవాసులు హాజరై రక్తదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

ఉప్పల్ : చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ ఆదివారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. చిలుకానగర్ ప్రాంతంలో దశాబ్దాల క్రితం వేసిన మ్యాన్ హోల్స్ చిద్రం అవ్వడంతో రోడ్లు అధ్వాన్నంగా మారాయని వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జలమండలి జీఎం సంతోష్‌కుమార్ మ్యాన్‌హోల్స్‌ను మరమ్మత్తులు చేస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్ ఈఈ నాగేందర్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో అధికారులతో కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్

ఎమ్మెల్యే అభినందన



అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ : కుషాయిగూడ భజన మందిర్ గణేష్ ఉత్సవ సమితి నిర్వహక చైర్మన్‌గా నియమితులైన పండాల శివకుమార్‌గౌడ్‌ను ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. 78 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అందుకు పూర్తి సహకారం అందజేయాలని శివకుమార్ ఎమ్మెల్యేను కోరారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న కొత్త కిశోర్‌గౌడ్

బోడుప్పల్: 4వ డివిజన్ పరిధిలోని శుభోదయకాలనీలో ఆదివారం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ – బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీహాల్ నిర్మాణాన్ని త్వరితిగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాలనీ అధ్యక్షులు చిరంజీవి, ఉపాధ్యక్షులు కాశీ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, కోశాధికారి సంజీవ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ నూతన కమిటీ

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ సాయినగర్‌లోని శ్రీసాయి సమాజ్ చారిటబుల్ ట్రస్ట్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సీనియర్ ట్రస్టీగా వెంకటేశం, చైర్మన్‌గా చింతల మల్లేషగౌడ్, వైస్ చైర్మన్‌గా లింగారెడ్డి, సెక్రటరీగా నర్సింగ్‌సింగ్, ట్రెజరర్‌గా వీరేశంయాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హన్మంత్‌రావు, ట్రస్టీలుగా ప్రభాకర్, జయశేఖర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.



వృక్షా రక్షాబంధన్ ర్యాలీ



ర్యాలీ అనంతరం చెట్టుకు రాఖీ కడుతున్న దృశ్యం

అల్వాల్: వృక్షా రక్షాబంధన్ సందర్భంగా ఆదివారం పర్యావరణ సంరక్షణ గతివిధి ఆధ్వర్యంలో అల్వాల్ బతుకమ్మ పార్కు నుంచి పలు కాలనీలో పాదయాత్ర, సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మల్లికార్జున్, గోపాల్‌రావు, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జగన్, దేవేందర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీ నూతన అధ్యక్షుడిగా హరీష్‌రెడ్డి ఏకగ్రీవం



వెంకటరమణ కాలనీ నూతన సభ్యులు

మల్లాపూర్: మల్లాపూర్ వెంకటరమణ కాలనీ అధ్యక్షుడిగా హరీష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాంచందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరేష్, కోశాధికారి వెంకటేష్ కార్యదర్శులుగా సృజన్‌రెడ్డి, ఆసీఫ్‌ఖాన్, సంయుక్త కార్యదర్శిగా శివారెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. వెంకటరమణ కాలనీ సంక్షేమం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

యువతను చైతన్యపరచడమే జ్ఞానమాల



కాకూర్‌లో జ్ఞానమాలలో పాల్గొన్న కమిటీ సభ్యులు

అల్వాల్: యువతరాన్ని చైతన్యం చేయడం కోసమే జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పీఎల్‌జి.శంకర్ అన్నారు. జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొకూర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్ట్ శ్రీరాములు, జ్ఞానమాల నిర్మాణ కమిటీ అధ్యక్షులు పోతురాజు శ్రీనివాస్, శ్యామలరావు, భాగ్యమ్మ, మంగాదేవి, నాగమణి, శ్రీనివాస్, బాలనర్సింహ, రవీంద్రనాథ్, బాలయ్య, నాగేశ్వర్, రాజు, శంకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

- అల్వాల్ అంబేడ్కర్‌నగర్‌లో గంపల రాజయ్య, యాప్రాల్‌లో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు.

విశ్వకర్మ సంఘం నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేసిన నూతన సభ్యులు

రామంతాపూర్ : శ్రీ విశ్వకర్మ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా నాగారం శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శిగా కొడపర్తి రామచంద్రచారి, కోశాధికారిగా గోవిందారం కోటేశ్వరచారి ఆదివారం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు స్థానిక వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం మందముల పరమేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు, కుందారం గణేష్‌చారి, వేములవాడ మదన్‌మోహన్, నాగారం భాస్కరచారి, శిల్పి, శశిధర్, భైరవరామస్వామి, యాలాల వెంకటేష్‌చారి, కే.ఎస్.చారి, హరిచారి, కనకాచారి, ప్రభాకర్‌చారి, సోమయ్యచారి పాల్గొన్నారు.

రూ.5 భోజన కేంద్రాల పరిసరాలను పట్టించుకోండి



రామంతాపూర్ : ప్రధాన రహదారి టీవీ స్టూడియో వద్ద, డిమార్ట్ మాల్ వద్ద జీహెచ్ఎంసీ హరే రామ హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.5 భోజనం పంపిణీ కేంద్రాల పరిసరాల్లో చుట్టూ చెత్తాచెదారంతో పాటు ఇతర వ్యర్థాలు నిండిపోయి అపరిశుభ్రంగా మారాయి. ఈ భోజనాల కేంద్రాలకు రోజూ దాదాపు 500 మంది వచ్చి భోజనం చేస్తుంటారు. ఈ వ్యర్థాలతో భోజనం కలుషితమై ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఈ కేంద్రాల వద్ద పేరుకుపోతున్న చెత్త,చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని భోజన పంపిణీ కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. ముక్కు మూసుకుని భోజనం చేస్తున్నామని వచ్చిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.